# చితికిన గుండెలు

సుబ్బారావు చదువుకున్న వాడన్నమాటేగాని ఇంత అనాగరికుడని నేననుకోలేదు. శెలవుపెట్టమని ఎంత పోరినా ఏమీ మాట్లాడడు. అసలు ఆ కాస్త ప్రాణంపోతే ఏం చేస్తావని అడిగితే పోయే ప్రాణాన్ని పట్టుకుంటే ఆగుతుందా అంటాడు. ఇతడి వైఖరిచూసి నాకాశ్చర్యం వేస్తున్నది.

సుబ్బారావు భార్య టైఫాయిడ్ జ్వరంవచ్చి గిలగిల కొట్టుకుంటున్నది. ఇంటిదగ్గర విచారించే దిక్కులేదు. సుబ్బారావు ఆఫీసుకువెళ్తే పావురుమంటూ ఒక్కటే దిగులు పడి కూర్చోవాలి. సుబ్బారావుకు ఏమాత్రం ఆదుర్దాలేదు. అతడికి లేకపోతే పరాయివాళ్ళ కెందుకుంటుందీ? సుబ్బారావూ నేనూ బాల్యస్నేహితులం కాబట్టి ఆ అమ్మాయికి ఉన్నట్టుండి టైఫాయిడ్ వస్తే నా మనస్సు చివుక్కుమన్నది.

"ఏంరా సుబ్బారావూ డాక్టరేమన్నాడు?" అన్నాను.

"ఏమీ అన్లేదు" అన్నాడు.

అసలు సుబ్బారావు వాలకంచూస్తే డాక్టరు దగ్గరికి వెళ్ళాడా లేదా అని నా అనుమానం. వారం రోజులపాటు శెలవుపెట్టి ఇంటి దగ్గర కూర్చోమని నేచెప్పిన సలహాను పెడ చెవిని పెట్టాడు. మామూలుగా ఆఫీసుకు పోతూవస్తూనే ఉన్నాడు.

నాకు విపరీతమైన కోపం వచ్చింది.

ఇంత అశ్రద్ధగా ఉంటావేంరా మూర్ఖుడా అన్నాను. సుబ్బారావు నోరు పెగల్చలేదు.

ఒకనాడు సుబ్బారావు ఇంటికి వెళ్ళాను. కమలమ్మ ముసుగుపెట్టుకుని పడుకుంది మంచంమీద. దగ్గరకువెళ్ళి కమలమ్మా అన్నాను. నాకు మూలుగు మాత్రం వినిపించింది.

"డాక్టర్ ఏమన్నాడు !" అన్నాను.

డాక్టర్ ఇంతవరకు రాలేదన్నది.

మరి మందు లేదన్న మాట అన్నాను.

ఊహు అన్నది. టైఫాయిడ్ జ్వరంవస్తే మందు కూడా ఇప్పించకుండా బాధపెట్టుతున్నాడు దౌర్భాగ్యుడు అనుకున్నాను. చిక్కి శల్యమైపోయింది. ఆ రేగినజుత్తూ లోతుకుపోయిన కళ్ళూ పాలిపోయిన ముఖమూచూస్తే నాకు భయమేసింది. కమలమ్మ చిన్నప్పుడు ఎంత అందంగా ఉండేది ? మంచానికి అతుక్కుపోయిన కమలమ్మ మందు లేకుండా ఇంకా ఉంటే చచ్చిపోతుంది. నాకేమీ తోచలేదు.

సరాసరి సుబ్బారావు ఆఫీసుకు వెళ్ళాను. సుబ్బారావు తలవంచుకుని ఆఫీసులో పని చేస్తున్నాడు. గబగబా అతడి "సీటు" దగ్గరికు వెళ్ళి ఏం కమలమ్మను చంపదల్చుకున్నావా ఏవిటి ? అన్నాను. నన్ను చూసి సుబ్బారావు. వణికిపోయినాడు. "ఏం మాట్లాడవేం" ఘట్టిగా దబాయించాను. తను వ్రాస్తున్న కలం పాళీవైపు తప్ప అతని దృష్టి మరోచోట లేదు.

సుబ్బారావును చూస్తే నాకసహ్యాం వేసింది. మరాసరి పోష్టాఫీసుకువచ్చి కమలమ్మ నాన్నగారికి టెలిగ్రాం ఇచ్చాను.

ం ం ం ం

ఆఫీసు ఎదురుగావున్న హోటలులో సుబ్బారావు కాఫీ త్రాగుతున్నాడు. కమలమ్మ వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుని "నన్ను చూస్తే ఎందుకూ మీ కంత అసహ్యాం? నేను చచ్చిపోతున్నాను లెండి. మీ కోరిక నెరవేర్తుంది" అని అంటున్నది. కమలమ్మ ఈపాటికి చచ్చిపోయే ఉంటుందను కున్నాడు సుబ్బారావు. ఆరోజు సాయంత్రం సుబ్బారావుకు ఇంటికిపోను బుద్దిపుట్టలేదు. సినిమా హాలులో వెళ్ళి కూర్చు న్నాడు. సినిమాలో తెరమీద బొమ్మలు గజిబిజిగా ఉన్నయ్. తన పక్కనే కుర్చీలో కమలమ్మ వచ్చి కూర్చుంది. "ఏమండీ? ఇటు చూడండి...నన్ను ప్రతిరోజు హింసపెట్టేవాళ్ళుగదా మీరు కొట్టే దెబ్బలకు ఓర్చుకోలేక కుయ్యో మొర్రో అంటుంటే హాయిగా ఉంటుందా మీకు...చచ్చిపోతే మరీ సంతోషిస్తారను కుంటా...మీరు చాల గొప్పవారు ఒకరు బాధపడ్తుంటే చూసి ఆనందిస్తారు మీరు పలకరేం?"...సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. పక్కనున్న కుర్చీవైపు చూశాడు. శానిటరీ ఇన్స్పెక్టరు సిగిరెట్టు కాలుస్తూ సినిమా చూస్తున్నాడు.

సగం సినిమాలో లేచివెళ్లాడు సుబ్బారావు. రోడ్డుమీద వెలుగుతున్న లైట్లను చూస్తూ నడుస్తున్నాడు. సుబ్బారావు

వెనకాలే కమలమ్మ వస్తుంది. వడి వడిగా వస్తున్నాడు సుబ్బారావు. "ఏముండీ ? ఎలాగో చచ్చిపోతాననే ధైర్యంతో ఉన్నారు. పాపం ఆ అమ్మవారి దయవల్ల ఈ టైఫాయిడ్ నయమై బ్రతుకుతాననుకోండి...మీ పనేమవుతుంది ? మళ్ళీ జ్వరంవస్తే బావుండునని కోరుతుంటారా...

...సుబ్బారావుకంటె, అతని మనసు వడి వడిగా పరుగులెత్తుతున్నది. సుబ్బారావు వెనకాలే కమలమ్మ మాట్లాడుతూ వస్తున్నది. "నేను చచ్చిపోయినాననే అనుకోండి. జరగబోయేదేముంది ? మీకు మరో లలితమ్మకు మంగళ సూత్రం కడ్తారు. ఆ లలితమ్మ చదువుకున్నదైనా మూర్ఖురాలు కావచ్చు. పల్లెటూరి అమ్మాయి ఐనా ఎంతో తెలివి తేటలు గలదై చురుకుగా ఉండవచ్చును. ఏదైనా మీ చేతుల్లో ఏమీలేదు. ఆ లలితమ్మకు నా అంత సహనం లేకపోవచ్చు. మీరు కొట్టే దెబ్బలకు ఓర్చుకోలేక ఆత్మహత్య చేసుకుంటే ?

ఎంత అమాయకులండీ మీరు డాక్టర్ని పిలుచుకువస్తే ఆ మందు త్రాగి జబ్బు ఎక్కడ నయమవుతుందోనని డాక్టరు దగ్గరకు పోవడమే మానేశారు...ఆయుర్దాయం ఉండి నా జీవితకాలం మరికొంచెం ముందుకు పోయిందనుకోండి...మరీ బాధపడ్తారేమో అప్పుడు ?

నేను పుస్తకాలూ అవీ చదివి తగినంత జ్ఞానం సంపాయించలేదనీ. కేవలం శారీరక వాంఛ తప్ప నాకు మరొకటి లేవనీ మీ అభిప్రాయం. అదే మనసులో పెట్టుకుని నన్ను "కాముకి" అన్నారు మీరు ఎన్నో తిట్టారు. చాలా సంకుచిత

మైన మనసుమీది. నెహ్రూ, మార్క్స్, బెర్నార్డ్‌షా పుస్తకాలు మీరు చదువుతారు. నాకు మా నాన్న, అమ్మా ఇంగ్లీషు చెప్పలేదు. అందుచేత అవి చదవలేను. భాగవతమూ, రామాయణము వల్లించుకున్నాను. అవంటే మీకు తలనొప్పి అసహ్యము కూడా.

మొదట్నుండీ నేనంటే, అజ్ఞానిననీ, అనాగరికురాలనని, కాముకిననీ, అనే అభిప్రాయాలు కలుగచేసుకున్నారు. మిమ్మల్ని నేనర్థం చేసుకోకపోలేదు. వీటితోపాటు నేను బీద దాన్ని కావడంకూడా వచ్చింది. నేను బీద కుటుంబంలోంచి వచ్చాననన్నంత మాత్రాన మీరు అసహ్యించుకోవాల్సినిలేదు. ఎన్నోసార్లు ఆక్షేపించారు. మా నాన్న వంటచేసి డబ్బు సంపాయించాడని అది నీచమని. దొరలదగ్గర మీరుచేసే చాకిరి బావుంది మీకు. మీ దృష్టిలో అది నీచంకాదేమో !

నాకు చదువు నేర్పుతారనీ, జ్ఞానభిక్ష పెడ్తారనీ ఆశించాను. నా ముఖం చూస్తేనే అసహ్యించుకునేవాళ్ళు. సహించి ఊరుకోవడం నాకు పరిపాటి అయిపోయింది. ఏ నాటికైనా మనసు కరుగుతుందనీ, అభిప్రాయాలు మార్చుకుంటారనీ ఆ అమ్మవారికి మొక్కుకున్నాను. నానాటికీ మీలోని కర్కశత్వము గట్టిపడ్డదికాని, ఏ విధమైన మార్పులేదు. పైగా నేను చచ్చిపోతేనే బావుంటుందని మీ ప్రవర్తనవల్ల సూచించారు.

నాకింకా భగవంతుడు మేలుచేస్తాడనే నా ఆరాటం. మంచిరోజులు వస్తయి అనీ, మీ మనసు మార్చుకుంటారనీ నాకింకా ఆశవుంది. మరి మీరో !

సుబ్బారావు ఇంకా వడివడిగా నడుస్తున్నాడు. ఎంత సీపటికీ తన ఇల్లురాదు. అతనికంటె అతని మనసు గుర్రంలా పరుగెటుపోతున్నది. ఒక్కసారి వెనక్కు తిరిగి చూశాడు. కమలమ్మ తనవెంట రావడంలేదు. కమలమ్మ నులకమంచం మీద టైఫాయిడ్‌తో మూలుగుతున్నది. సుబ్బారావు ఇల్లు చేరుకున్నాడు. ఇంట్లో మినుకు మినుకుమింటున్న దీపం ఆరిపోతానంటూ వెలుగుతున్నది.

ఇంట్లోకి అడుగుబెట్టగానే, మనసు పరుగెత్తటం మానేసింది. ఎవరో ఒక వ్యక్తి కమలమ్మ దగ్గరే కూర్చున్నాడు. సుబ్బారావుని చూడగానే నాయినా సుబ్బారావూ వచ్చేవా అన్నాడాయన. మామగారికి నమస్కారాలు అన్నాడు సుబ్బారావు. మధ్యాన్నంనుండి కమలమ్మకు ఆయాసం ఎక్కువైపోయింది. నా చేతుల్లో నిలవలేకపోయిండి. నీవు వచ్చేముందే కళ్ళు మూసింది. నాయనా అని బావురుమన్నాడు మామగారు.

కమలా...ఎంత అఘాయిత్యం చేశావు. అంతపనీ చేశేవు...భూకంపం వచ్చినట్లయింది. కాళ్లు నిలవలేదు. ఏడుస్తూ కమలమ్మ శవంమీదకొరిగాడు. కమలమ్మ శవం కదిలింది! అమ్మవారి దయవల్ల కమలమ్మ బ్రతక్కూడదూ ?

ప్రజాబంధు

)o(